సొంత డప్పు తప్పా పాలన చేతగాని కూటమి

- ఆలూరు ఎమ్మెల్యే బుసినె విరూపాక్షి
- హొన్నూరు కొట్టాల రోడ్డు పనుల పరిశీలన



హొళగుంద-హొన్నూరు కొట్టాల రోడ్డు పనులను పరిశీలిస్తున్న ఆలూరు ఎమ్మెల్యే బుసినె విరూపాక్షి

హొళగుంద: వైఎస్సార్‌సీపీ పాలనలో మంజూరైన నిధులతో ప్రస్తుతం రోడ్డు పనులు జరుగుతుంటే టీడీపీ నాయకులే మంజూరు చేసినట్లు సొంత డప్పు కొట్టుకోవడం హాస్యాస్పదంగా ఉందని ఆలూరు ఎమ్మెల్యే బుసినె విరుపాక్షి విమర్శించారు. ఆయన మంగళవారం హొళగుంద - హొన్నూరు కొట్టాల రోడ్డు (తెక్కలకోట రోడ్డు) పనులను పరిశీలించారు. అంతకుముందు హొన్నూరు కొట్టాల పాఠశాలను సందర్శించి విద్యార్థులతో కలిసి కేక్ కట్ చేసి న్యూ ఇయర్ వేడుకలు జరుపుకున్నారు. అనంతరం ఎల్లెల్సీ 56వ డీపీ కాలువకు వేసిన పైపు లైన్ వద్ద నేల కుంగి గ్రావెల్, రాళ్లు పడి నీరంతా పక్కనున్న పొలాలు, రోడ్డుపై చేరిన ప్రదేశాన్ని పరిశీలించారు. కాలువ నీరు వెళ్లేందుకు కేవలం సిమెంట్ పైపులు మాత్రమే వేసి కల్వర్టు నిర్మించకపోవడంతో పైనుంచి వచ్చే నీరు ముందుకెళ్లకుండా అక్కడే నిలిచిపోతున్నట్లు ఆయకట్టు రైతులు వాపోయారు. అధికారులు, కాంట్రాక్టర్ దృష్టికి తీసుకెళ్లి సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటానని ఎమ్మెల్యే హామీఇచ్చారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ.. మార్లమడికి, హొన్నూరు కొట్టాల, కోగిలతోట, సమ్మతగేరి, ముగుమానుగుంది, పెద్దహ్యాట ఇలా మండలంలో చాలా గ్రామాల రోడ్లు జగనన్న హయంలో నిధులు మంజూరై పనులు కూడా పూర్తయ్యాయని తెలిపారు. ఎన్నికలు దగ్గర పడ్తున్న సమయంలో మార్లమడికి, హొన్నూరు కొట్టాల బీటీ రోడ్డు పనులు చేపట్టాల్సి ఉండగా ముందుగా ప్రధాన సమస్యగా ఉన్న మార్లమడికి పనులు చేపట్టినట్లు వెల్లడించారు. జగనన్న పాలనలో చేసిన పనులపై టీడీపీ నాయకులు తామే చేసినట్లుని సొంత డబ్బా కొట్టుకోవద్దని హితవు పలికారు. పార్టీ మండల కన్వీనర్ షఫివుల్లా, జిల్లా ఉపాధ్యక్షుడు ఎస్కే గిరి, నాయకులు కోగిలతోట శేషప్ప, ఎంపీటీసీలు మల్లికార్జున, హనుమప్ప, దర్గన్న, పల్లి ఈరన్న, రామకృష్ణ, పంపాపతి, షేక్షావలి, పాల్తూరు గోవిందు, మౌనేష్, నాగిరెడ్డి, మంజునాయక్ తదితరులు పాల్గొన్నారు.



హొన్నూరు కొట్టాల పాఠశాలలో విద్యార్థుల మధ్య న్యూ ఇయర్ వేడుకలు జరుపుకుంటున్న ఎమ్మెల్యే

నూతన సంవత్సర శుభాకాంక్షలు



పత్తికొండ మాజీ ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి

కృష్ణగిరి: పత్తికొండ నియోజకవర్గ ప్రజలకు, పార్టీ నాయకులకు, కార్యకర్తలకు, దివంగత చెరుకులపాడు నారాయణ రెడ్డి అభిమానులకు పత్తికొండ మాజీ ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి 2025 నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. నూతన ఏడాదిలో ప్రజలు ఆయురారోగ్యాలతో ఉండాలని, ప్రజల జీవితాల్లో వెలుగులు నింపాలని ఆకాంక్షించారు. కొత్త సంవత్సరంలో ప్రజల జీవన ప్రమాణాలు మెరుగుపడటంతో పాటు మరింత ముందుకు సాగేందుకు దోహదం చేయాలన్నారు. పార్టీ నాయకులకు, కార్యకర్తలకు ఎల్లవేళలా అండగా ఉంటడంతో పాటు పార్టీ బలోపేతం చేస్తూ ప్రజా సమస్యలపై పోరాటాలు చేస్తామని తెలియజేశారు. నూతన సంవత్సర సందర్భంగా బుధవారం కర్నూలులోని కృష్ణానగర్ స్వగృహంలో మాజీ ఎమ్మెల్యేతో పాటు, పార్టీ రాష్ట్ర కార్యదర్శి ప్రదీప్‌కుమార్‌రెడ్డి అందుబాటులో ఉంటారని వైఎస్సార్‌సీపీ పార్టీ పత్తికొండ కార్యాలయం ఓ ప్రకటన విడుదల చేశారు.

మండలాన్ని అభివృద్ధి పథంలో నడిపిద్దాం

- పార్టీలకు అతీతంగా అధికారులు పని చేయాలి
- ఎంపీపీ డాక్టర్ కంగాటి వెంకటరామిరెడ్డి



మాట్లాడుతున్న ఎంపీపీ డాక్టర్ కంగాటి వెంకటరామిరెడ్డి

కృష్ణగిరి: అధికారులు, ప్రజా ప్రతినిధులు సమన్వయంతో పని చేసి మండలాన్ని అన్ని విధాల అభివృద్ధిలోకి తీసుకువద్దామని ఎంపీపీ డాక్టర్ కంగాటి వెంకటరామిరెడ్డి అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం ఎంపీడీఓ మోహన్‌కుమార్ ఆధ్వర్యంలో మండల సర్వసభ్య సమావేశం జరిగింది. ఆయన మాట్లాడుతూ.. పార్టీలకు అతీతంగా అధికారులు పనిచేసినప్పుడే అభివృద్ధి జరుగుతుందన్నారు. అధికారులు కూడా తమ విధులు, బాధ్యతలు తెలుసుకుని నడుచుకోవాలన్నారు. మరో రెండు నెలల తర్వాత వేసవి ప్రారంభమవుతుందని గ్రామాల్లో తాగునీటి సమస్య లేకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. విద్య, వైద్య సేవలు ప్రజలకు సకాలంలో అందజేయాలన్నారు. గ్రామాల్లో ఏవైనా సమస్యలుంటే తమ దృష్టికి తీసుకువస్తే పరిష్కారానికి చర్యలు తీసుకుంటామన్నారు. జెడ్పీటీసీ కేఈ సుభాషిణి మాట్లాడుతూ పార్టీలకు అతీతంగా అభివృద్ధి చేసేందుకు ముందుంటామని తెలిపారు. కాగా సమావేశానికి కొందరు అధికారులు గైర్హాజరు కావడంపై అసహనం వ్యక్తం చేశారు. మరోమారు ఇలా జరగకుండా చూసుకోవాలని ఎంపీడీఓ మోహన్‌కుమార్‌కు సూచించారు. బోయబొంతిరాళ్ల గ్రామ సర్పంచ్ రవిమోహన్ మాట్లాడుతూ తమ గ్రామంలో గ్రామ సచివాలయ భవనాన్ని నిర్మించాలని, అలాగే తాగునీటి సమస్యకు పరిష్కారం చూపాలని కోరారు. విషయంపై ఎంపీడీఓ మోహన్‌కుమార్ మాట్లాడుతూ సమస్యలన్నీ తీర్మానంలో నమోదు చేసి ఉన్నతాధికారులకు పంపుతామని తెలిపారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీలు బోయ సుశీల, కత్తి రాజేష్, మండల కో ఆప్షన్ మెంబర్ షేక్ షాలుమియ్యా, తహసీల్దార్ చంద్రశేఖర్, ఏఓ వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి కృషి

హొళగుంద: గ్రామంలో ప్రధానంగ వేధిస్తున్న సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటున్నట్లు హెబ్బటంలో పంచాయతీ కార్యదర్శి రాజశేఖర్ తెలిపారు. మంగళవారం హెబ్బటంలో సర్పంచ్ కృష్ణవేణి ఆధ్వర్యంలో గ్రామ పంచాయతీ సాధారణ సమావేశం నిర్వహించారు. గ్రామంలోని ప్రతి వీధిలో పారిశుద్ధ్య చర్యలు తీసుకుంటామన్నారు. డ్రైనేజీల శుభ్రత, పూడిక తొలగింపు తదితర పనులు చేపట్టనున్నట్లు వెల్లడించారు. అదేవిధంగ తాగనీరు, వీధి దీపాల ఏర్పాటు ఆయా వీధుల్లోని ఇతర ప్రధాన సమస్యల పరిష్కారానికి తీసుకోవాల్సిన చర్యలు, నిధుల వెచ్చింపుతో పాటు పలు అభివృద్ధి పనులు చేపట్టిందుకు గాను తీర్మానం చేశారు. కార్యక్రమంలో వైస్ సర్పంచ్ సవారప్ప, వార్డు సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

భూ సమస్యల పరిష్కారానికే రెవెన్యూ సదస్సులు

హొళగుంద: భూ సమస్యల పరిష్కారానికే రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తున్నట్లు తహసీల్దారు సతీష్ అన్నారు. మంగళవారం ముగుమానుగుంది గ్రామంలో రెవెన్యూ సదస్సు జరిగింది. ఈ సందర్భంగా ఆన్‌లైన్ అడంగల్‌లో విస్తీర్ణానికి సంబంధించి సమస్యలు, భూముల క్రయ విక్రయాల ఇబ్బందులు తదితర వాటి గురించి రైతులు అధికారుల దృష్టికి తీసుకొచ్చారు. వీఆర్‌ఓ నాగరాజు, సచివాలయ ఉద్యోగులు తదితరులు పాల్గొన్నారు.

ఆస్పరి: మండలంలోని చిరుమాన్‌దొడ్డి గ్రామంలో మంగళవారం రెవెన్యూ సదస్సు నిర్వహించారు. ఆ గ్రామ రైతులు భూ సమస్యలపై తహసీల్దార్ శివశంకర్‌నాయక్‌కు దరఖాస్తులు ఇచ్చారు. ఎంపీపీ సుంకర ఉమాదేవి, సర్పంచ్ సుంకర నాగమ్మ, డీటీ భీమేష్, బీఆర్‌ఓ మాబుసుభాన్ తదితరులు పాల్గొన్నారు.

ఆలూరు రూరల్: మండలంలోని ఏ.గోనేహాల్ గ్రామంలో తహసీల్దార్ గోవింద్ సింగ్ ఆధ్వర్యంలో రెవెన్యూ సదస్సు నిర్వహించారు. 4 అర్జీలు వచ్చినట్లు తహసీల్దార్ వెల్లడించారు.

క్లుప్తంగా

రామలింగేశ్వరస్వామి ఆలయంలో సప్త భజనలు



హాలహర్వి: మండలంలోని నిట్రవట్టి గ్రామంలో మంగళవారం శరణం రామలింగేశ్వర తాత 86వ పుణ్యారాధన కార్యక్రమాన్ని చేపట్టారు. 10 గ్రామాల ప్రజలు సప్త భజనలో పాల్గొన్నారు. ఆంధ్ర నుంచే గాక కర్ణాటక రాష్ట్రం నుంచి అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. జనవరి 1న నందికోలు, గంగపూజ కార్యక్రమాలు ఉంటాయని గ్రామపెద్దలు తెలిపారు. భక్తులు తాత పుణ్యారాధన కార్యక్రమంలో పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

ఆక్రమణల తొలగింపు



ఆక్రమణలు తొలగిస్తున్న దృశ్యం

మద్దికెర : మండల కేంద్రమైన మద్దికెరలో పంచాయతీ కార్యాలయం సమీపంలో నాయీబ్రాహ్మణ వీధిలో రోడ్డుపై నిర్మించిన అక్రమ కట్టడాలను మంగళవారం కార్యదర్శి శివకుమార్ ఆధ్వర్యంలో తొలగించారు. ఆయన మాట్లాడుతూ ప్రజలు తమ స్థలం పరిధిలో మాత్రమే నిర్మాణాలు చేపట్టాలన్నారు. రోడ్డు ఆక్రమించి నిర్మిస్తే భవిష్యత్తులో రోడ్డు వెడల్పు చేసినపుడు తొలగించాల్సి ఉంటుందని చెప్పారు. దీంతో నష్ట పోవాల్సి వుంటుందన్నారు.

హెల్మెట్‌తో ప్రాణ రక్షణ



పత్తికొండలో ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

పత్తికొండ(తుగ్గలి) : ద్విచక్ర వాహనం నడిపే ప్రతి ఒక్కరూ హెల్మెట్ తప్పనిసరిగా ధరించాలని ఆదోని మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ సిసిరాదీప్తి, పత్తికొండ అర్బన్ సీఐ జయన్న సూచించారు. మైత్రి చారిటబుల్ ట్రస్ట్ అధ్యక్షుడు రామ్మోహన్ ఆధ్వర్యంలో స్థానిక జూనియర్ కళాశాలలో మంగళవారం విద్యార్థులకు హెల్మెట్ వాడకంపై అవగాహన సదస్సు నిర్వహించారు. విద్యార్థులతో కలిసి పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. వారు మాట్లాడుతూ.. హెల్మెట్లు లేకుండా వాహనాలు నడిపేటప్పుడు రోడ్డు ప్రమాదాలు జరిగితే ప్రాణాలు పోతున్నాయన్నారు. ప్రాణ రక్షణ కోసం ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలన్నారు. మైనర్లకు వాహనాలు ఇవ్వద్దని, ఇస్తే వాహన యజమానులపై కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు.

సహకార సంఘాల స్థలాల పరిశీలన

చిప్పగిరి: మండలంలోని బెల్డోణ సహకార సంఘం పరిధిలోని స్థలాలను డివిజినల్ కో-ఆపరేటివ్ ఆఫీసర్ ఉమాదేవి మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా మండలంలోని నేమకల్లు సొసైటీ గోదామును పరిశీలించి స్థలం కొలతలు వేయించారు. వారు మాట్లాడుతూ.. సొసైటీ స్థలాలు అక్రమిస్తే చట్ట ప్రకారం చర్యలుంటాయని హెచ్చరించారు. ఖాళీ స్థలాల్లో రైతులకు ఉపయోగపడేలా గోదాములు నిర్మించేందుకు ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపుతామన్నారు. సొసైటీ ప్రత్యేక అధికారి రామరాజు, బెల్డోణ సొసైటీ సీఈఓ హరికృష్ణ, సర్పంచ్ ప్రేమ్‌కుమార్, శ్రీకాంత్, లక్ష్మినారాయణ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ఎస్‌ఎఫ్‌ఐ ఆవిర్భావ దినోత్సవం



జెండా ఆవిష్కరిస్తున్న ఎస్‌ఎఫ్‌ఐ నాయకులు

పత్తికొండ(తుగ్గలి) : ఎస్‌ఎఫ్‌ఐ ఆవిర్భావ దినోత్సవాన్ని మంగళవారం ఆ సంఘం నాయకులు ఘనంగా నిర్వహించారు. పత్తికొండ జూనియర్ కళాశాల వద్ద సంఘం నాయకులు రవికుమార్, దస్తగిరి, వెంకటేశ్వరరెడ్డి, రంజిత్ జెండా ఆవిష్కరించారు. అధ్యయనం, పోరాటం, చదువుతూ పోరాడు, చదువుకై పోరాడు అనే నినాదాలతో అనే నినాదాలతో విద్యార్థుల సమస్యల కోసం పోరాటం చేస్తామన్నారు. ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు ప్రతి విద్యార్థికి తల్లికి వందనం అమలు చేయాలని డిమాండ్ చేశారు. పత్తికొండలో ప్రభుత్వ పీజీ, డిప్లొమా, ఐటీఐ కళాశాలలు ఏర్పాటు చేయాలన్నారు. సంఘం నాయకులు హిమాంబీ, కౌసల్య, మధు, చాణక్య, రాహుల్, అజయ్ పాల్గొన్నారు.

3న జాబ్ మేళా

ఆలూరు: స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణంలో ఈనెల 3వ తేదీన జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ రమాదేవి మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. జిల్లా వృత్తి నైపుణ్యాభివృద్ధి సంస్థ అధికారి ఆనందరాజ్ కుమార్ ఆధ్వర్యంలో ఎస్‌బీఐ ఇన్సూరెన్స్, బీఎంఎస్ సెక్యూరిటీస్ కంపెనీలకు చెందిన ప్రతినిధులు హాజరవుతారన్నారు. నిరుద్యోగులు ఒరిజినల్ సర్టిఫికెట్లు, రెండు సెట్ల జిరాక్స్ కాపీలు, లేటెస్ట్ నాలుగు పాస్ ఫొటోలతో ఇంటర్వ్యూకు హాజరుకావాలన్నారు.

ఆకట్టుకున్న సైన్స్ ప్రదర్శన



విద్యార్థులు తయారు చేసిన నమూనా ప్రాజెక్టులను పరిశీలిస్తున్న ఉపాధ్యాయులు, ఎంఈఓ-2

దేవనకొండ: మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ పాఠశాలలో మంగళవారం సైన్స్ ఫెయిర్ కార్యక్రమాన్ని హెచ్‌ఎం మద్దిలేటి ఆధ్వర్యంలో నిర్వహించారు. కుంకనూరు, కేజీబీవీ, తెర్నెకల్, పి.కోటకొండ, దేవనకొండ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల విద్యార్థులు పాల్గొని పలు వైజ్ఞానిక నమూనా ప్రాజెక్టులు తయారు చేసి ప్రదర్శించారు. ఇందులో తెర్నెకల్ జెడ్పీ పాఠశాల విద్యార్థులు ప్రదర్శించిన అబ్స్టేటెడ్ అవైడింగ్ రోబోట్ ప్రధాన ఆకర్షణగా నిలిచింది. దేవనకొండ జెడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులు తయారు చేసిన బయో డీగ్రేడబుల్ ప్లేట్ అండ్ కప్స్ ఆకర్షణగా నిలిచాయి. అలాగే కుంకనూరు జెడ్పీ పాఠశాల నుంచి బేబీ ప్రజెన్స్ డిటెక్టర్ అండ్ వార్నింగ్ సిస్టం ప్రాజెక్టు కూడా ఆకర్షణగా నిలిచింది. వీరు జిల్లా స్థాయిలో వైజ్ఞానిక ప్రదర్శనలో పాల్గొంటారని హెచ్‌ఎం, ఎంఈఓ-2 తెలిపారు. విద్యార్థుల్లోని ప్రతిభను వెలుగులోకి తీసుకురావడానికి సైన్స్ ఫెయిర్ ఎంతగానో ఉపయోగపడుతుందని వారు చెప్పారు. ఉపాధ్యాయులు శివలక్ష్మి, ఉస్మాన్, వీరేశప్ప తదితరులు పాల్గొన్నారు.

50 శాతం పశుగణన పూర్తి

కృష్ణగిరి: మండలంలో 50 శాతం పశుగణన పూర్తి చేసినట్లు పశువైద్యాధికారి నవీన్ తెలిపారు. స్థానిక పశువైద్యశాలలో మంగళవారం ఆయన రైతులతో మాట్లాడారు. పశుగణన కోసం గ్రామాల్లోకి వచ్చే అధికారులకు అందరూ సహకరించాలన్నారు. మండలంలో 11,856 గృహాలకు గాను ఇప్పటివరకు 50శాతం ఇళ్లు తిరిగి గణన పూర్తి చేశామని, మిగిలిన వాటిని కూడా పూర్తి చేస్తామన్నారు. అలాగే నీటి సౌకర్యం ఉన్న రైతులకు గడ్డి విత్తనాలు రాయితీపై ఇస్తున్నామని చెప్పారు. రైతులు వీటిని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

డయల్ యువర్ డీఎంకు 23 వినతులు

పత్తికొండ(తుగ్గలి) : డయల్ యువర్ డిపో మేనేజర్ కార్యక్రమానికి స్పందన వచ్చిందని పత్తికొండ ఆర్టీసీ డిపో మేనేజర్ మహమ్మద్ రఫీక్ తెలిపారు. మంగళవారం ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు నిర్వహించిన డీవైడీఎం కార్యక్రమానికి పత్తికొండ డిపో పరిధిలోని గ్రామాల ప్రయాణికుల నుంచి 23 విజ్ఞప్తులు వచ్చినట్లు చెప్పారు. వాటిలో అధికంగా గుంతకల్లు నుంచి తుగ్గలి మీదుగా కర్నూలుకు బస్సు నడపాలని, పత్తికొండ-గుత్తికి ఆర్డినరీ సర్వీసులు కావాలని, అదే విధంగా ఆలూరుకు సమయానుకూలంగా బస్సులు నడపాలని ప్రయాణికులు విజ్ఞప్తి చేశారన్నారు. విజ్ఞప్తులను ఉన్నతాధికారులకు పంపి పరిష్కారానికి కృషి చేస్తామని తెలిపారు.

ఎస్సీ జాబితా నుంచి తొలగించాలి



డిప్యూటీ తహసీల్దార్‌కు వినతి పత్రం అందిస్తున్న ఎమ్మార్పీఎస్ నాయకులు

ఆలూరు రూరల్: గ్రామ, వార్డు సచివాలయాల్లో ప్రదర్శించిన ఎస్సీ కుల జాబితాలో ఇతర కులాలకు చెందిన వారి పేర్లను తొలగించాలని ఎమ్మార్పీఎస్ నాయకులు డిమాండ్ చేశారు. ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపకుడు మందకృష్ణ మాదిగ ఆదేశాల మేరకు మంగళవారం డిప్యూటీ తహసీల్దార్ విజయ్ కుమార్‌కు వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. సచివాలయాల్లో ప్రదర్శించిన ఎస్సీ జాబితాలో ఇతర కులస్తుల పేర్లు చోటు చేసుకున్నాయన్నారు. గతంలో ఎస్సీయేతర కులస్తులైన మాదాసి, మాదారి కురువ తదితర కులాల పేరుతో కుల ధ్రువీకరణ పత్రాలు పొందారన్నారు. జాబితాలో తప్పులు సరిదిద్ది ఇతర కులస్తుల పేర్లను తొలగించాలని కోరారు. ఎమ్మార్పీఎస్ జిల్లా ప్రచార కార్యదర్శి ముత్యాల గాదిలింగ నాయకులు బాలరాజు, మల్లి, సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా మారెమ్మవ్వ జోడు కుంభోత్సవం




ప్రత్యేక అలంకరణలో మారెమ్మ దేవి, సమ్మతగేరిలో మేటి కుంభోత్సవం జరుగుతున్న దృశ్యం

హొళగుంద: మండల పరిధిలోని సమ్మతగేరి గ్రామంలో వెలసిన మారెమ్మ దేవి జోడు కుంభోత్సవం మంగళవారం ఘనంగా జరిగింది. ఆలూరు ఎమ్మెల్యే బుసినె విరూపాక్షి, వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేయించారు. అదేవిధంగా పత్తికొండ డీఎస్పీ వెంకటరామయ్య, టీడీపీ ఆలూరు ఇన్‌చార్జ్ వీరభద్రగౌడ్ తదితరులు అమ్మవార్లను దర్శించుకున్నారు. చుట్టు పక్కల పల్లెలతో పాటు ఆంధ్ర - కర్ణాటకకు చెందిన భక్తులు మారెమ్మ దేవిని దర్శించుకోవడానికి తరలివచ్చారు. మంగళవారం తెల్లవారుజామున గ్రామ పురవీధుల గుండా పవిత్ర గంగాజలంతో బయలుదేరిన మేటి కుంభాలు ఆలయానికి చేరకోవడంతో భక్తులు భక్తి పారవశ్యంలో మునిగారు. ఈ సందర్భంగా గంగా పూజానంతరం భక్తులు కుంభాలను వీధుల్లో ఊరేగింపుగా తీసుకెళ్లి ఆలయంలో ఉంచారు. అనంతరం దేవికి ఆకుపూజ, మహామంగళారతి, కలశ పూజ, బలి దానం, నైవేద్య సమర్పణ ఇతర ప్రత్యేక పూజలు చేపట్టారు. నిర్వాహకులు భక్తులకు అన్నదానం చేశారు. అవాంఛనీయ ఘటనలు జరగకుండ హొళగుంద ఎస్ఐ బాల నరసింహులు, సిబ్బంది బందోబస్తు నిర్వహించారు.

ఎస్సీ జాబితాలో చేర్చడంపై నిరసన

పత్తికొండ(తుగ్గలి) : తుగ్గలి మండలం చెన్నంపల్లి సచివాలయం పరిధిలోని రామలింగాయ పల్లిలో కురువలను ఎస్సీలుగా గుర్తించేందుకు కుల గణన జాబితాలో చేర్చడాన్ని నిరసిస్తూ మంగళవారం పత్తికొండ ఆర్డీఓ కార్యాలయం ఎదుట ధర్నా దళిత సంఘం నాయకులు చేశారు. దళిత సంఘం నాయకులు మహానంది, వసంత్‌కుమార్, బాలరాజు, సాయిరాం, నాగేంద్ర మాట్లాడుతూ.. మాదాసి కురవ, మాదారి కురవ ఈ ప్రాంతంలోనే లేరని, అలాంటప్పుడు వారిని ఎస్సీ జాబితాలో ఎలా చేరుస్తారని ప్రశ్నించారు. ఉన్నత స్థితిలో ఉన్న బీసీలైన కురవలను ఎస్సీల్లోకి చేరడం వల్ల తమకు తీరని అన్యాయం జరుగుతుందన్నారు. అనంతరం ఆర్డీఓ భరత్‌నాయక్‌కు వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో దళిత సంఘం నాయకులు ఎల్లప్ప, మధు, వెంకటరాముడు, భరత్, మల్లికార్జున తదితరులు పాల్గొన్నారు.

మారని తీరు.. తప్పని పడిగాపులు



గ్యాస్ బండి వద్ద క్యూలో వేచివున్న వినియోగదారులు

హొళగుంద: గ్యాస్ ఏజెన్సీ వారు తమతీరు మార్చు కోకపోవడంతో వినియోగదారులు పనులు మానుకుని ఎండలో గంటల తరబడి పడిగాపులు కాయాల్సిన పరిస్థితి తప్పడం లేదు. మంగళవారం కూడా భారత్ గ్యాస్ కోసం వినియోగదారులు గంటల తరబడి పడిగాపులు కాశారు. ప్రతి మంగళవారం గ్యాస్ డెలివరీ చేయడానికి ఆదోని నుంచి హొళగుందకు వస్తున్న సదరు గ్యాస్ వాహనం ప్రతిసారి సమయ పాలన పాటించడం లేదు. దీనివల్ల వినియోగదారులు పనులు మానుకుని గంటల తరబడి వేచి చూడాల్సిన దుస్థితి నెలకొంది. ఆలస్యంగా రావడమే కాకుండా డోర్ డెలివరీ చేయకుండా ఒక చోట వాహనాన్ని నిలబెట్టి పంపిణీ చేస్తూ ట్రాన్స్‌పోర్ట్ చార్జీలు వసూలు చేస్తున్నారు. అధికారులు స్పందించి సక్రమంగా ఇంటింటికీ గ్యాస్ సకాలంలో అందేలా చర్యలు తీసుకోవాలని వినియోగదారులు కోరుతున్నారు.

శిక్షణా తరగతులకు స్పందన కరువు

చిప్పగిరి: స్థానిక ఎంఆర్‌సీ భవనంలో మంగళవారం ఎస్‌ఎంసీ కమిటీ చైర్మన్లు, ప్రధానోపాధ్యాయులకు పాఠశాలల అభివృద్ధిపై నిర్వహించిన ఒక్కరోజు శిక్షణ కార్యక్రమానికి స్పందన కరువైంది. మండలంలో మొత్తం 26 పాఠశాలలకు ఎస్‌ఎంసీ చైర్మన్లు ఉండగా కేవలం ఐదారు పాఠశాలల చైర్మన్లు మినహా మిగతావారు హాజరు కాలేదు. అరకొరగా హాజరైన ప్రధానోపాధ్యాయులు, చైర్మన్లకు నామమాత్రంగా శిక్షణ ఇచ్చి కార్యక్రమం ముగించారు. శిక్షణ పొందిన చైర్మన్లు ఈ నెల 2న ఆయా పాఠశాలల్లో కమిటీ మెంబర్లకు శిక్షణ ఇవ్వాల్సి ఉండగా, శిక్షణకు రాని వారు ఇక మెంబర్లకు ఏం శిక్షణ ఇస్తారని పలువురు విమర్శలు వ్యక్తం చేస్తున్నారు. ఎస్‌ఎంసీ చైర్మన్లు అనిత, అరుణ, నాగరాజు, విజయశాంతి తదితరులు శిక్షణకు హాజరయ్యారు.

కుంటను పూడ్చండి

మద్దికెర : స్థానిక మాలవీధిలో ఉన్న తంబులకుంటను పూడ్చివేయాలని కాలనీవాసులు మంగళవారం ఈఓ శివకుమార్‌కు వినతిపత్రం అందజేశారు. వారు మాట్లాడుతూ కుంటలో మురుగునీరు నిలిచి దుర్వాసన వెదజల్లడమే కాకుండా దోమలు వ్యాప్తి చెంది రోగాల బారిన పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా సంబంధిత పంచాయతీ అధికారులు చర్యలు చేపట్టి కుంటను పూడ్చాలని కోరారు. ఈఓ మాట్లాడతూ కుంటను పరిశీలించి ప్రతిపాదనలు పంపి పూడ్చేందుకు చర్యలు తీసుకుంటామన్నారు.

విద్యార్థుల మెదడుకు పదును పెట్టాలి

ఆలూరు: విద్యా విధానంలో నూతన ఒరవడులను అనుసరిస్తూ విద్యార్థుల మెదడుకు ఉపాధ్యాయులు పదును పెట్టాల్సిన బాధ్యత ఉందని ఆలూరు ఎంఈఓ కోమలాదేవి సూచించారు. ఎల్లార్తి రోడ్డు సమీపంలోని మోడల్ స్కూల్ ఆవరణలో మంగళవారం ఎస్టీయూ నూతన క్యాలెండర్‌ను రాష్ట్ర నాయకులు నాగరాజ్ ఆధ్వర్యంలో ఆమె ఆవిష్కరించారు. ఆలూరు ఎంఈఓ -2 చిరంజీవి రెడ్డి, ఎస్టీయూ నాయకులు గిరయ్య, శ్రీనివాసరెడ్డి, శ్రీనివాసులు, ఈరన్న తదితరులు పాల్గొన్నారు.


విద్యార్థి ప్రతిభ



షీల్డ్ అందుకుంటున్న మహేష్

ఆస్పరి: రాష్ట్ర స్థాయి కౌశల్ పోస్టర్ ప్రజెంటేషన్ పోటీల్లో మండలంలోని మోడల్ స్కూల్లో 9వ తరగతి చదువుతున్న మహేష్ అనే విద్యార్థి ప్రతిభ చూపి తృతీయ స్థానంలో నిలిచినట్లు ప్రిన్సిపాల్ షమీల మంగళవారం తెలిపారు. ఈ పోటీలు ఈనెల 30వ తేదీ విజయవాడలో జరిగాయన్నారు. తృతీయ స్థానంలో నిలిచిన విద్యార్థి మహేష్‌కు విజయవాడ ఎమ్మెల్యే గద్దె రామోహన్‌రావు షీల్డ్, ప్రశంసాపత్రంతో పాటు రూ. 2వేలు నగదు అందజేశారని తెలిపారు.

సచివాలయంలోనే పింఛన్ల పంపిణీ



సచివాలయంలో పింఛన్లు పంపిణీ చేస్తున్న విలేజ్ వెటర్నరీ అసిస్టెంట్

చిప్పగిరి: ప్రభుత్వం ప్రతి నెలా 1వ తారీఖున లబ్ధిదారుల ఇళ్ల వద్దకే వెళ్లి పింఛన్లు పంపిణీ చేయాలని ప్రభుత్వ ఆదేశాలు ఉన్నప్పటికీ ప్రభుత్వ ఆదేశాలు బేఖాతర్ చేస్తున్నారు. మండలంలోని పలువురు సిబ్బంది ఇష్టానుసారంగా పంపిణీ చేపడుతుండడంతో లబ్ధిదారులు తీవ్రఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. మంగళవారం మండలంలోని 9 గ్రామ సచివాలయాల పరిధిలోని 16 గ్రామాల్లో గ్రామ సచివాలయ సిబ్బంది పింఛన్ సొమ్ము పంపిణీ కార్యక్రమం చేపట్టారు. చాలా గ్రామాల్లో లబ్ధిదారుల ఇళ్ల వద్దకు వెళ్లకుండా గ్రామంలోని కాలనీల్లో ఏదో ఒక చోట కూర్చొని పింఛన్ల పంపిణీ చేపట్టారు. మండల కేంద్రం చిప్పగిరిలో గ్రామ సచివాలయం లోనే పలువురు వృద్ధులకు పింఛన్ పంపిణీ చేయడంతో వృద్ధులు, వికలాంగులు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ప్రభుత్వం ఇళ్ల దగ్గర పింఛన్ పంపిణీ చేయమంటే ఇలా చేయడం ఏమిటని పలువురు లబ్ధిదారులు ఆగ్రహం వ్యక్తం చేశారు.

విద్యార్థుల సమస్యలపై పోరాటం

ఆస్పరి: సమస్యల పరిష్కారం కోసం పోరాటం చేయాలని ఎస్‌ఎఫ్‌ఐ నాయకులు వినోద్, రవి విద్యార్థులకు సూచించారు. మంగళవారం ఆస్పరిలో ఎస్‌ఎఫ్‌ఐ 55వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా ఆ సంఘం జెండాను రవి ఆవిష్కరించారు. ఎస్‌ఎఫ్‌ఐ నాయకులు తరుణ్, మహేష్ పాల్గొన్నారు.